క్లుప్తంగా

ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న పూజారులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లెలో వెలసిన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఇందులో రూ.15.23 లక్షల ఆదాయం సమకూరిందని దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 72 రోజుల్లో అమ్మవారికి భక్తులు రూ.15,23,196 సమర్పించారని చెప్పారు. కానుకల లెక్కింపులో దేవస్థానం చైర్మన్ కృష్ణుడు, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు పాల్గొన్నారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 24వ తేదీన కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో శిథిలమైన పాత ధ్వజ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నామని ఈఓ సీతారామిరెడ్డి, దేవస్థానం చైర్మన్ తిరుపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని భగవంతుడి కృపకు పాత్రులు కావాలని కోరారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు చేయండి

సి.బెళగల్: ఉపాధి హామీ కూలీలు దినసరి గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులు చేయాలని ఏపీఓ లక్ష్మన్న సూచించారు. సోమ వారం మండల కేంద్రం శివారులో జరుగుతున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించి మస్టర్ సమర్థవంతంగా నిర్వహించాలని మేట్లకు సూచనలు చేశారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ, సమయపాలన పాటించి, కొలతల మేరకు పనులను చేసుకోవాలని చెప్పారు. టీఏలు, ఎఫ్ఏలు, మేటీలు ఉన్నారు.

గోనవరం వాసికి డాక్టరేట్



డాక్టరేట్‌కు ఎంపికైన సాహెబ్‌ఖాన్

పాణ్యం: మండలంలోని గోనవరం గ్రామానికి చెందిన సాహెబ్‌ఖాన్ డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. ఫిజిక్స్ విభాగంలో జమాలయ్య పర్యవేక్షణలో 'ఆప్టికల్ అనాలసిస్ ఆఫ్ ప్రసోడైమియం సమేరియం అండ్ యూరేపియం, డోప్డ్ స్ట్రాంటియం, గాడోలినియం, ఫాస్ఫేట్ నానో ఫాస్పర్స్ ఫర్ డిస్‌ప్లే అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన చేసి పత్రాలను సమర్పించగా అనంతపురం జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది.

మట్టి నమూనాల సేకరణ



పెసరవాయిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గడివేముల: మండలంలోని పెసరవాయి గ్రామ పొలాల్లో సోమవారం మట్టి నమునాలను సేకరించినట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. క్రిబ్‌కో ప్రతినిధి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది రైతుల పొలాల్లో శాంపిల్స్‌ను సేకరించామని, 15 రోజుల్లో ఫలితాలను రైతులకు అందజేస్తామని చెప్పారు. వీటి ఆధారంగా రైతులు ఏఏ ఎరువులు ఉపయోగించాలో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏ నాగార్జున రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని డ్యామ్ అధికారులు సోమవారం తెలిపారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

గూడూరు రూరల్: స్పందనకు వచ్చే అర్జీలు, వినతుల పట్ల సచివాలయ ఉద్యోగులు పరిష్కారం చూపడంలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామనిఎంపీడీఓ మాధవీలత స్పష్టం చేశారు. పెంచికలపాడులోని గ్రామ సచివాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల్లో ప్రతి రోజూ స్పందన కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సచివాలయాల్లోనే తమ సమస్యలపై అర్జీలు, వినతులను అందిస్తే ఉద్యోగులు వాటిని పరిశీలించి నిర్ణీత సమయంలోపు పరిష్కారం చూపుతారని చెప్పారు. సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

సృజనాత్మకతకు వేదికలు.. విజ్ఞాన శిబిరాలు

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వారిలో సృజనాత్మకతను పెంపొందించేలా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు గ్రంథాలయాలను వేదికగా మార్చింది. ఆయా గ్రంథాలయాల్లో చిన్నారులకు రోజూ ఇంగ్లిష్‌లో సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనతో పాటు, యోగా,క్యారమ్స్, చెస్ వంటి ఏకాగ్రతను పెంపొందించే క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. అలాగే పఠనంపై ఆసక్తి పెంపొందించేలా పుస్తక పఠనం చేయిస్తున్నారు.

- సెలవుల్లో జ్ఞాన సముపార్జనలో బాలలు
- చదువుతో పాటు పలు నైపుణ్యాల్లో శిక్షణ
- శిక్షణ కేంద్రాలుగా గ్రంథాలయాలు



నీతి కథలు బోధిస్తున్న గడివేముల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం దస్తగిరమ్మ



చదరంగం ఆడుతున్న విద్యార్థులు

గడివేముల: బాలల్లో పఠనాసక్తి పెంచేందుకు, వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయాల్లో ఈ నెల 8నుంచి జూన్ 11 తేదీ వరకు వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు, నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంగ్ల భాషలో సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనలో శిక్షణ ఉంటుంది. క్యారమ్స్, చెస్ ఆటలు ఆడిస్తారు. అతిథుల ప్రసంగాలను వినిపిస్తారు. శిక్షణకు ఆసక్తి కలిగిన 4,5 తరగతుల విద్యార్థులు హాజరు కావచ్చు. కాగా 11–15 ఏళ్ల వయస్సు ఉండే పిల్లలు అధికంగా హాజరవుతున్నారు. స్థానిక గ్రంథాలయంలో రోజూ 38 మంది నుంచి 42 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారు.

మూడు ఉద్దేశాలు..

- బాలలు వేసవి సెలవుల్లో లభించే విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- చదవడాన్ని వారు ఒక మంచి అలవాటుగా పెంపొందించుకోవాలి.
- క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వచ్చేలా వారిలో ఆసక్తి కలిగించాలి. బాలల సాహిత్యానికి చెందిన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయాలి.

కాలనిర్ణయ పట్టిక..

ఇందుకు అనుగుణంగా రోజూ గ్రంథాలయాల్లో బాలలకు ఉదయం కథలు వినిపిస్తారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయంలో ఉండే పుస్తకాల పఠనం చేయిస్తున్నారు. 20 నిమిషాలపాటు పుస్తక సమీక్ష చేస్తారు. పదిన్నర నుంచి 11 గంటల వరకు వారికి కథలు వినిపించటంతో పాటు..పిల్లలతో కథలు చెప్పిస్తారు.

మాతృభాషపై అవగాహన పెరిగింది



లైబ్రరీలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో మన మాతృభాషపై అవగాహన కల్పించారు. అలాగే తల్లిదండ్రులను, గురువులను గౌరవంగా చూసుకోవడం, వినయ విధేయతలతో ఎలా ఉండాలో నేర్పించారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వెళ్లడం వల్ల మనకు తెలియని ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. పుస్తకాల ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించవచ్చని తెలుసుకున్నా.

– శిరీష, 8వ తరగతి విద్యార్థిని, గడివేముల

గ్రంథాలయంలో ఎన్నో నేర్చుకున్నాను



వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఇక్కడ నీతి కథల పుస్తకాలను చదివి ఎంతో స్ఫూర్తిని పొందుతున్నా. కథలు చదవడం, వినడం, చెప్పడం ద్వారా నాకున్న స్టేజ్ ఫియర్‌ని పోగొట్టుకునేందుకు శిక్షణ తరగతులు ఎంతగానో సహాయపడుతున్నాయి.

– సంతోష్, ఆరో తరగతి విద్యార్థి, గడివేముల

పుస్తకాలపై మక్కువ పెంచుకోండి



వేసవి శిక్షణ శిబిరాలతో బాలబాలికల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెరుగుతుంది. చదువుతో పాటు పలు ఇతర నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నందు వల్ల వారిలో సృజనాత్మకతను వెలికితీయవచ్చు. బాల్యం నుంచే పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవటం వల్ల మెదడుకు పదును పెట్టవచ్చు. పుస్తకాలపై మక్కువ పెంచుకోవడం వల్ల ప్రపంచం అర్థమవుతుంది. – వెంకటేశ్వరరెడ్డి, గ్రంథాలయాధికారి, గడివేముల

కొలతల ప్రకారం పనులు చేయించండి

గూడూరు రూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలకు గరిష్ట వేతనం రూ.272 లభించాలంటే కొలతల మేరకు, నిర్దేశిత సమయం వరకు పనులు చేయించాలని ఏపీఓ రామేశ్వరమ్మ సూచించారు. మండలంలోని కె.నాగలాపురం జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఫీల్డుఅసిస్టెంట్లు కూలీలకు సమయపాలనపై అవగాహన కల్పించాలని, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పనులు చేయించాలని ఆదేశించారు. కూలీలు కూడా ఉదయాన్నే పని ప్రదేశానికి చేరుకుని, సూచించిన కొలతల ప్రకారం పని చేస్తేనే పూర్తి స్థాయి వేతనం పడుతుందని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 4వేల మంది కూలీలు పనులకు వస్తున్నారని, కూలీల హాజరు తగ్గకుండా సిబ్బంది చూసుకోవాలని కోరారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 196 సచివాలయాల పరిధిలో 132 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం 491 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. స్థానిక నగరపాలక రెవెన్యూ విభాగం హాలులో ఉదయం 10 గంటల నుంచి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

కథా రచయిత కేతు విశ్వనాథ రెడ్డి మృతి తీరనిలోటు

కర్నూలు కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటని నంది అవార్డు గ్రహీత, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. సోమవారం తెల్లవారు జామున ఆయన గుండె పోటుతో మరణించారని తెలిపారు. రాయలసీమలో కథా సాహిత్యం వృద్ధి చెందడానికి ఆయన చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు.

'గోరుముద్ద' కింద విద్యార్థులకు గ్లాసులు మంజూరు



హెచ్ఎంలకు గ్లాసులకు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఈఓ మహబూబ్ బేగ్

నంద్యాల(న్యూటౌన్): జగనన్న గోరుముద్ద పథకానికి జిల్లాలోని 1,365 పాఠశాలలకు 1,52,526 స్టీల్ గ్లాసులు మంజూరయ్యాయని డిప్యూటీ ఈఓ మహబూబ్‌బేగ్ తెలిపారు. సోమవారం స్థానిక విశ్వనగర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేశారు. నంద్యాల మండలానికి 16,631 గ్లాసులు మంజూరు కావడంతో పంపిణీ చేశామని ఆయన చెప్పారు. గ్లాసులపై జగనన్న గోరుముద్ద అనే పేరు కూడా ముద్రించారన్నారు. నంద్యాలలోని 28 మండలాల ఎంఈఓలకు గ్లాసులను అందించామని, వీటిని హెచ్ఎంలకు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీఎం ఇక్బాల్, ఎంఈఓ బ్రహ్మంనాయక్, ప్రధానోపాధ్యాయులు ప్రమీల, మోహన్‌రెడ్డి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ఎ.ఆనందరావు

కర్నూలు (న్యూసిటీ): దైనందిన జీవితంలో కంప్యూటర్ ఆవశ్యకత పెరిగిందని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ. ఆనందరావు చెప్పారు. సోమవారం లైఫ్ సైన్స్ భవనంలోని కంప్యూటర్ ల్యాబ్‌లో బోధనేతర సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడు తూ బోధనేతర ఉద్యోగులందరూ కంప్యూటర్ సంబంధ కోర్సులు నేర్చుకోవాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ మా ట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి, సిబ్బంది, కంప్యూటర్ శిక్షకుడు జాన్ పాల్గొన్నారు.

నేటి సమాచారం

వేరుశనగ విత్తన పంపిణీ

కోడుమూరు రూరల్: మండలంలోని రైతులకు ఖరీఫ్‌లో సాగు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన వేరుశనగ విత్తనాల పంపిణీని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ప్రారంభిస్తారని ఏఓ రవిప్రకాష్ సోమవారం తెలిపారు. వేరుశనగ క్వింటా రూ.9,300 నిర్ణయించగా, ప్రభుత్వం ఇచ్చే 40 శాతం సబ్సిడీ పోనూ రైతు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. విత్తనం అవసరమైన రైతులు ఆయా ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు.

వలంటీర్లకు వందనం..

సంక్షేమ పథకాల అమలులో ఉత్తమ సేవలందించిన వలంటీర్లను మంగళవారం పట్టణంలోని బాలుర హైస్కూల్లో 'వలంటరీలకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరై వలంటీర్లను సత్కరిస్తారని చెప్పారు. కోడుమూరు, ప్యాలకుర్తి, వెంకటగిరి, ముడుమలగుర్తి, కల్లపరి, వర్కూరు, పులకుర్తి గ్రామ సచివాలయాల వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు గ్రామ సచివాలయం–3,4 పరిధిలోని కాలనీల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించి, సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

మొబైల్ ఆధార్ క్యాంపులు

కోడుమూరు: మండలంలోని కోడుమూరు–1, పులకుర్తి–2, గోరంట్ల–2, ప్యాలకుర్తి–1 గ్రామ సచివాలయాల్లో ఈనెల 23,24,25,30,31వ తేదీల్లో మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈ కేంద్రాల్లో 5సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేయించుకోవాలని, పొరపాట్లు ఉంటే సరిచేయించుకోవాలని, ఆధార్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు అప్‌డేట్ చేయించుకోని వారు అప్‌డేట్ చేయించుకోవాలని కోరారు.

మండల మీట్..

కల్లూరు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ బోయ శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్):నగరంలో చేపట్టే మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత లు విధించనున్నట్లు కర్నూలు టౌన్ డీఈఈ–1 రాజమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. నగరంలోని నిర్మల్ నగర్, కృష్ణారెడ్డి నగర్, బళ్లారీ చౌరాస్తా సమీప పరిసరాల్లో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు విద్యు త్‌సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నా రు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వాహనాల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ఎస్పీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు టూటౌన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టూటౌన్ పోలీస్టేషన్ పరిధిలో పట్టుబడి సరైన పత్రాలు, యజమానుల ఆచూకీ తెలియని వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3వేలు డిపాజిట్‌ను టూటౌన్ స్టేషన్‌లో చెల్లించి రసీదు పొందాలని, రసీదు ఉన్న వారినే వేలం పాటకు అనుమతిస్తామని చెప్పారు.

బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

కర్నూలు(హాస్పిటల్): గర్భిణిలు బీపీని నియంత్రణలో ఉంచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్. వెంకటరమణ చెప్పారు. సోమవారం గైనకాలజీ విభాగంలో ప్రీ క్లామ్సియా డే సందర్భంగా గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు 20 వారాల తర్వాత బీపీ 140/90 కంటే ఎక్కువగా ఉంటే ప్రీ క్లామ్సియా అంటారన్నారు. మూత్రంలో ఆల్బుమిన్ ప్లస్ ఉంటే కచ్చితంగా ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఇదే సమయంలో సీబీపీ, కిడ్నీ, లివర్, ఫండస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 37 వారాల దాటిన తర్వాత ప్రసవం అయ్యేటట్లు చూసుకోవాలని పేర్కొన్నారు. 20 వారాల తర్వాత కాళ్లవాపు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో గైనకాలజిస్టులు డాక్టర్ ఎ. సుధారాణి, డాక్టర్ స్నిగ్దం, డాక్టర్ సుధాకర్, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

కర్నూలు (రూరల్): డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి సూచించారు. సోమవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో డ్వాక్రా సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సదస్సు నిర్వహించారు. జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడారు. జగనన్న ఆసరా పథకాన్ని అన్ని సంఘాలకు వర్తింపజేయాలన్నారు. మొదటి విడతలో 90 లక్షల మందికి రుణ విముక్తి కల్పించగా ఏప్రిల్‌లో విడుదల చేసిన మూడో విడతలో 74 లక్షల మందికి రుణ విముక్తి కల్పించారు. మిగిలిన వారికి కూడా అర్హతను ప్రామాణికంగా చేసుకుని అర్హులను గుర్తించాలన్నారు. సున్నా వడ్డీ పథకాన్ని మూడు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలన్నారు. బ్యాంకు అధికారులు లోన్ ఇచ్చే సమయంలో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. అభయహస్తం పథకం ద్వారా అర్హత కలిగిన మహిళలను గుర్తించి పెన్షన్లు ఇవ్వాలన్నారు. పొదుపు సంఘాల సమన్వయం, సాధికారత కోసం కృషి చేస్తున్న ఆర్పీలపై పనిభారం తగ్గించి బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు టీఏ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అరుణ, షహానా, రషీద్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా నారాయణరెడ్డి



కర్నూలు కల్చరల్: ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా డీసీడీ ఆర్‌సీ సభ్యులు నరహరి నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం కర్నూలులో జరిగిన శతాధిక కవి సమ్మేళనంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నారాయణరెడ్డిని నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. తెలుగు భాషా సాహిత్యానికి చేసిన సేవకు గుర్తింపుగా నారాయణరెడ్డిని గౌరవాధ్యక్షుడిగా నియమించారు. ఆయన నియామకంపై పలువురు సాహితీ వేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

31న ఖాదర్‌లింగస్వామి ఉరుసు ప్రారంభం



స్వామి సమాధిని అలంకరించిన దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు ఈనెల 31 నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. సోమవారం ఆయన ఉరుసు తేదీలను ప్రకటించారు. 31న స్వామి సమాధిని సుగంధ ద్రవ్యాలతో శుభ్రపేయడం, జూన్ 1న గంధం, 2న ఉరుసు ఉత్సవాలు ఉంటాయని, 3న (సఫేరాలూటేనా) స్వామి ప్రసాదం పంపిణీ, 4న జియారత్ వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు. కాగా ఉరుసు ఉత్సవాల సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మకర్త మున్నపాషా ఇంటి నుంచి ప్రత్యేక చాదర్‌ను బ్యాండు మేళాలు డప్పువాయిద్యాల మధ్య దర్గాకు తెచ్చి ఫాతెహాలు చేశారు. ఉరుసు రోజు వరకు ప్రతి రోజు రాత్రి ఫాతెహ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రెమిడియల్ తరగతులను వినియోగించుకోండి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: పదిలో ఫెయిలైన విద్యార్థులంతా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాసులను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో పాసవ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. పట్టణంలోని బాలుర హైస్కూల్లో పది ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న రెమిడియల్ క్లాసులను ఎంఈఓ అనంతయ్యతో కలిసి సోమవారం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పదిలో ఫెయిలైన విద్యార్థులంతా పాసవ్వాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెమిడియల్ క్లాసులను ఏర్పాటు చేసిందని, విద్యార్థులు క్లాసులకు తప్పక హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని పాసవ్వాలని చెప్పారు. హెచ్ఎం శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన లింగన్న

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో బొలెరో వాహనం ఢీకొని స్థానిక బీసీ కాలనీకి చెందిన లింగన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కోడుమూరులోని బీసీ కాలనీకి చెందిన లింగన్న మరో వ్యక్తితో కలిసి కర్నూలులో గౌండ పని ముగించుకొని బైక్‌పై కోడుమూరుకు వస్తుండగా పట్టణ సమీపంలోని వర్రప్పజిన్ను వద్ద కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. అయితే బొలెరో డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా కర్నూలు వైపు వెళ్లిపోయాడు. స్థానికులు కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులుకు ప్రమాద విషయాన్ని తెలియజేయడంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోండి



సి.బెళగల్ స్పందనలో ప్రభుత్వ భూ ఆక్రమణాలపై ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

సి.బెళగల్: మండల కేంద్రంలోని ముక్కలగట్టు, క్రిష్ణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల వైపు ఉండే కొండలు, ప్రభుత్వ స్థలాలను కొందరు రాత్రికి రాత్రే ఆక్రమించుకుంటున్నారని, అక్రమార్కులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు గొర్ల మద్దిలేటి, పాండు, సోమన్న తదితరులు స్పందనలో అధికారులకు అర్జీ అందజేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో తహసీల్దార్ శివశంకర్‌నాయక్ స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు జలకళ బోర్లు, భూ సమస్యలు, మంచినీరు, మురుగు కాలువలు, ఇళ్ల పట్టాలు తదితర వాటిపై వినతి పత్రాలు అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ఎర్రమట్టి అక్రమ తరలింపు, కొండ ప్రాంతాలలో మొక్కల పెంపకంపై ప్రజలు అర్జీలు ఇచ్చారు.

స్పందన సమస్యలను వెంటనే పరిష్కారించండి..

ప్రజల సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ తెలిపారు. స్పందన కార్యక్రమం అనంతరం ఆయన మండల, గ్రామ స్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, స్పందనతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు గోసేనాయక్, సూర్య ప్రకాష్, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

గూడూరు: స్పందన దరఖాస్తుల పట్ల నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాధవీలత, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, పీఆర్ ఏఈ గోపాల్‌రావ్, హౌసింగ్ ఏఈ పురుషోత్తం రావు తదితరులు పాల్గొన్నారు.